సాక్షి ఖమ్మం

మంగళవారం । 10 । సెప్టెంబర్ । 2024



ముసురుతున్న వ్యాధులు

వరద తగ్గడంతో సీజనల్ జ్వరాలే కాక దగ్గు, జలుబు, చర్మవ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. 8లో



'రోటరీ' ఆపన్నహస్తం

వరదతో సర్వం కోల్పోయిన ముంపు ప్రాంతాల ప్రజలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యాన 2,500 కిట్లను పంపిణీ చేశారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31° / 24°

జిల్లా అంతగా మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఉష్ణోగ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

విధిగా హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలి



కళాజాతాను ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ సుబ్బారావు

ఖమ్మంవైద్యవిభాగం: హెచ్ఐవీపై ప్రజలందరూ అవగాహన పెంపొందించుకుని విధిగా పరీక్ష చేయించుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వి.సుబ్బారావు సూచించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై పోలూరి రాము కళాబృందం ఆధ్వర్యాన సోమవారం ఖమ్మం పాతబస్టాండ్‌లో కళాజాతా ఏర్పాటుచేయగా అదనపు డీఎంహెచ్ఓ వెంకటరమణతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్ని ఆయుష్ ఆరోగ్య కేంద్రాల్లో హెచ్ఐవీ పరీక్ష ఉచితంగా చేస్తారని తెలిపారు. అంతా కలిసికట్టుగా పోరాడితే జిల్లాను హెచ్ఐవీ రహితంగా మార్చొచ్చని చెప్పారు. కాగా, జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ 31 వరకు ప్రదర్శనలు కొనసాగుతాయని తెలిపారు. ఉద్యోగులు డి.సత్యకుమార్, మహమూద్ అలీ, వివిధ సంస్థల బాధ్యులు కొండల్‌రావు, సుందర్, శివ పాల్గొన్నారు.

రాకాసితండాలో పనులపై ఆరా



వరదతో నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న సీఈఓ దీక్షారైనా

తిరుమలాయపాలెం: ఆకేరు వరదతో తీవ్రంగా నష్టపోయిన మండలంలోని రాకాసితండాను సోమవారం జెడ్పీ సీఈఓ దీక్షా రైనా పరిశీలించారు. ఈ సందర్భంగా వరదలతో దెబ్బతిన్న ఇళ్లు, పంట పొలాలను పరిశీలించిన ఆమె బాధితులతో మాట్లాడారు. సర్వం కోల్పోయిన తమను ఆదుకోవాలని మహిళలు, రైతులు ఈ సందర్భంగా కోరారు. కాగా, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, ప్రజలు ధైర్యంగా ఉండాలని సీఈఓ భరోసా కల్పించారు. అనంతరం తండాలో పారిశుద్ధ్య పనులు, జల్లెపల్లిలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా దమ్మాయిగూడెంకు చెందిన ఉన్నం రాజశేఖర్ వరద బాధితులకు ఆహారం సమకూర్చగా సీఈఓ అభినందించారు. ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఎంపీఓ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి అనూష పాల్గొన్నారు.

వరద బాధితులకు లింకేజీ రుణాలు

అర్హులను గుర్తించాలని కలెక్టర్ ఆదేశం

నేలకొండపల్లి: వరద బాధితులను ఆదుకునేందుకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మరో అడుగు ముందుకేశారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, కారేపల్లి, కామేపల్లి, వైరా, కూసుమంచి తదితర ప్రాంతాల్లో వరదతో తీవ్రంగా నష్టపోయిన స్వయం సహాయక సంఘాల సభ్యులను గుర్తించి బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రూపు అర్హతల ఆధారంగా మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం రుణాలు ఇప్పించి వారికి అండగా నిలవాలని సూచించారు. ఈ నేపథ్యాన ఐకేపీ అధికారులు ముంపు గ్రామాల్లో బాధితులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. కాగా, బాధితులకు రుణాలు ఇప్పించడం ద్వారా ఊరట లభిస్తుందని పలువురు చెబుతున్నారు.

మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాల్లో 5నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జోనల్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం రీజియన్ పరిధిలోని గురుకులాల్లో మిగిలిన సీట్ల కోసం ఈనెల 12న ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ జూనియర్ కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు. ఎస్సీ విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉండగా, అర్హత పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

నేటి నుంచి విద్యాసంస్థలు పునఃప్రారంభం

ఖమ్మం సహకారనగర్: వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యాన ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, ఖమ్మం రూరల్ మండల పరిధిలోని అన్ని విద్యాసంస్థలు మంగళవారం నుంచి తెరుచుకోనున్నాయి. వర్షాలు, వరదతో ఈనెల 8వరకు సెలవులు ప్రకటించగా... 9వ తేదీన కూడా కేఎంసీ, ఖమ్మం రూరల్ మండలాల్లో పాఠశాలలు, కాలేజీలకు సెలవు ఇచ్చారు. అయితే, సోమవారం వర్షం లేకపోవడంతో మంగళవారం నుంచి విద్యాసంస్థలు తెరుస్తున్నట్లు డీఈఓ సోమశేఖరశర్మ, డీఐఈఓ రవిబాబు తెలిపారు. డిగ్రీ, పీజీ విద్యాసంస్థలు సైతం తెరుచుకుంటాయని అధికారులు వెల్లడించారు.

వరద మిగిల్చిన వేదన

జిల్లాలో మున్నేరు, ఆకేరు, వైరా, పాలేరు, కట్టలేరు వరద ఉధృతితో భారీ నష్టం జరిగింది. చాలాప్రాంతాల్లో ఇంకా రాకపోకలు మొదలుకాలేదు. ఎడతెరిపి లేని వర్షంతో అలుగులు ఉధృతంగా ప్రవహిస్తుండగా తరచూ రోడ్లపై నీరు చేరి రాకపోకలు స్తంభిస్తున్నాయి. జనజీవనం ఇంకా గాడిలో పడలేదు. ఈమేరకు శాఖల వారీగా నష్టం వివరాలను ప్రాథమికంగా అంచనా వేసిన జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి సమర్పించింది. ఎనిమిది శాఖల పరిధిలో రూ.339.46 కోట్ల మేర నష్టం జరిగినట్లు అందులో పొందుపరిచారు. అయితే, పంటలు, రోడ్లు, నివాసిత ప్రాంతాల నష్టమే ఎక్కువగా ఉంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

అన్ని శాఖల పరిధిలో రూ.339.46 కోట్ల నష్టం

- జిల్లా వ్యాప్తంగా దెబ్బతిన్న 15,201 గృహాలు
- 79,914 ఎకరాల్లో పంటలపై వరద ప్రభావం
- పలు ప్రాంతాల్లో కోతకు గురైన రహదారులు
- విద్యుత్, మత్స్యశాఖలకు కోలుకోలేని దెబ్బ



ఖమ్మం బొక్కలగడ్డ ప్రాంతంలో దెబ్బతిన్న ఇళ్లు

నామరూపాలు కోల్పోయిన పంటలు

నిబంధనల మేరకు 33 శాతానికి పైగా నష్టపోయిన పంటలను వ్యవసాయ, ఉద్యాన శాఖలు పరిగణనలోకి తీసుకుని నివేదికలు తయారు చేస్తున్నాయి. శనివారం వరకు వ్యవసాయ, ఉద్యానవన పంటలు కలిపి 53,528 మంది రైతులకు సంబంధించి 79,914 ఎకరాల్లో నష్టం జరిగినట్లు గుర్తించారు. ఇందులో అత్యధికంగా వరి 41,450 ఎకరాలు, పత్తి 31,119 ఎకరాలు ఉండగా, ఉద్యానవన పంటలతో సహా మొత్తం రూ.111.87 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. అయితే ఎకరానికి రూ.10వేలు చొప్పున పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఈ పరిహారంతో పొలాలను మళ్లీ సాగుకు సిద్ధం చేయడమెలాగో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు. తిరుమలాయపాలెం మండలంలోని పలు తండాల్లో ఆకేరు ఉధృతితో సాగు భూముల్లో రాళ్లు తేలాయి. ఇక పశు సంవర్ధక శాఖ పరిధిలో కోళ్లు, గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, పందులు 52,648 మేర వరదల్లో కొట్టుకుపోవడంతో రూ.1.16 కోట్ల నష్టం జరిగింది. అలాగే,మత్స్య శాఖకు రూ.4.29 కోట్ల నష్టం వాటిల్లింది.

దెబ్బతిన్న పంటలు, రైతుల వివరాలిలా..

పంట	రైతులు	ఎకరాలు
వరి	30,460	41,450
పత్తి	18,375	31,119
పెసలు	421	1,075
మొక్కజొన్న	63	96
ఉద్యాన	4,209	6,174
మొత్తం	53,528	79,914

ఛిద్రమైన రహదారులు

జిల్లాలో వరదల కారణంగా76 కి.మీ. మేర రహదారులు దెబ్బతిన్నాయి. పలు చోట్ల కోతకు గురికాగా, మరికొన్ని చోట్ల పూర్తిగా తెగిపోయాయి. ఈ మొత్తం నష్టం విలువ రూ.180.37 కోట్లుగా పేర్కొన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా నీటిపారుదల శాఖ అధికారులు తమ శాఖ పరిధిలో రూ.60 కోట్ల మేర నష్టం జరిగిందని నివేదికల్లో పొందుపర్చారు.



పాలేరు ఏటి వద్ద కోతకు గురైన రహదారి

45 చెరువులకు పలు ప్రాంతాల్లో గండ్లు పడ్డాయి. సాగర్ ప్రాజెక్టు కాల్వకు పాలేరు రిజర్వాయర్ సమీపాన గండి పడింది. అలాగే లిఫ్టులు చాలాచోట్ల మరమ్మతులకు గురయ్యాయి. మొత్తంగా 103 ప్రాంతాల్లో ఈ శాఖకు నష్టం వాటిల్లింది.

నేలకూలిన 4,500 స్తంభాలు

వరద ముంపు ప్రాంతాల్లో విద్యుత్‌శాఖకు రూ.14.50 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది. వరద భారీగా ముంచెత్తడంతో స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్లు పాడయ్యాయి. 4,500 స్తంభాలు, 570 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం కాగా, ఇళ్లు నీట మునగడంతో పాడైన వాటి స్థానంలో 925 కొత్త మీటర్లు అమర్చారు. అలాగే 72 పాఠశాలలు, రెండు ఆస్పత్రులపై వరద ప్రభావం చూపగా.. విద్య, విద్యుత్, వైద్య శాఖల పరిధిలో రూ.9.23 కోట్ల నష్టం జరిగినట్లు అధికార యంత్రాంగం ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొంది.



ప్రకాశ్‌నగర్ సబ్‌స్టేషన్‌లో కూలిన స్తంభాలు

ఖమ్మంలోనే 9,155 ఇళ్లు ధ్వంసం

భారీ వర్షాలతో జిల్లావ్యాప్తంగా 15,201 ఇళ్లు దెబ్బతిన్నట్లు యంత్రాంగం గుర్తించింది. ఇందులో 15,055 ఇళ్లు పాక్షికంగా.. 146 ఇళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని నివేదికలో పేర్కొన్నారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.6,500, పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.8వేల పరిహారం అందనుంది. అయితే ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోనే పాక్షికంగా దెబ్బతిన్నవి 9,155, పూర్తిగా దెబ్బతిన్నవి 84 ఇళ్లు ఉన్నాయి. ఖమ్మంరూరల్ మండలంలో 2,808 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు నివేదికలో పొందుపర్చారు. కాగా, ప్రభుత్వం ప్రకటించిన అరకొర సాయంపై బాధితుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. కొందరి ఇళ్లు పూర్తిగా కూలిపోగా, మరికొందరివి గోడలు, పై కప్పులు, స్లాబ్‌లు వరద ఉధృతితో పడిపోతే ఆదుకోవాల్సింది పోయి తక్కువ పరిహారం ఇవ్వనుండడంపై ఆందోళన చెందుతున్నారు. ఇళ్లు మరమ్మతు చేయించుకోవాలన్నా, మళ్లీ నిర్మించుకోవాలన్నా రూ.లక్షల్లో వెచ్చించాల్సి ఉంటుందని కన్నీటి పర్యంతమవుతున్నారు.

అత్యధికంగా ఇళ్లు దెబ్బతిన్న ప్రాంతాలు..

మండలం	ఇళ్లు
ఖమ్మంఅర్బన్	9,238
ఖమ్మంరూరల్	2,808
మధిర	1,153
ఎర్రుపాలెం	429
కూసుమంచి	423
ముదిగొండ	222
నేలకొండపల్లి	197
తిరుమలాయపాలెం	186
వైరా	136
చింతకాని	122
బోనకల్	117
ఇతర మండలాలు	170
మొత్తం	15,201

శాఖల వారీగా నష్టం వివరాలు

శాఖ	నష్టం
రెవెన్యూ	రూ.30 లక్షలు
పశుసంవర్ధకశాఖ	రూ.1.16 కోట్లు
ఆర్అండ్‌బీ, పీఆర్	రూ.180.37 కోట్లు
విద్యాశాఖ	రూ.1.20 కోట్లు
వైద్య ఆరోగ్యశాఖ	రూ.30 లక్షలు
విద్యుత్	రూ.7.73 కోట్లు
పంటలు	రూ.111.87 కోట్లు
మత్స్యశాఖ	రూ.4.29 కోట్లు
మొత్తం	రూ.339.46 కోట్లు

పరిమితంగానే పరిహారం

ఖమ్మంవ్యవసాయం: భారీ వర్షాలు, వరదలతో జిల్లాలో వేలాదిగా పశువులు, కోళ్లు మృత్యువాతపడ్డాయి. ప్రభుత్వ ఆదేశాలతో పశుసంవర్ధక శాఖ సర్వే నిర్వహించింది. ఈ మేరకు రూ.58,16,300 విలువైన 53,014 పశువులు, కోళ్లు మృతి చెందినట్లు నివేదిక రూపొందించారు. ఇందులో కోళ్లు 52,583, ఆవులు 18, ఎద్దులు ఏడు, గేదెలు 59, దున్నలు ఒకటి, గొర్రెలు 240, మేకలు 106 ఉన్నాయి. అయితే, పశువులు, కోళ్లకు పరిహారంపై ప్రభుత్వం పరిమితి విధించింది. ఒకరికి చెందిన గేదెలు ఎన్ని మరణించినా మూడు గేదెలకు రూ.50 వేల చొప్పున రూ.1.50 లక్షల పరిహారమే చెల్లిస్తారు. గొర్రెలు ఎన్ని మరణించినా 30 గొర్రెలకు రూ.5వేల చొప్పున, కోళ్లు ఎన్ని మరణించినా వంద కోళ్లకు మాత్రమే రూ.100 చొప్పున రూ.10 వేల పరిహారం చెల్లించనున్నారు.

ముగ్గురు ఎమ్మెల్యేలకు స్థానం

- అసెంబ్లీ అంచనాల కమిటీలో సభ్యులుగా రాందాస్, కనకయ్య
- ప్రజాపద్దుల కమిటీలో కూనంనేనికి చోటు



మాలోతు రాందాస్ నాయక్



కోరం కనకయ్య



కూనంనేని సాంబశివరావు

వైరా/ఇల్లెందు: శాసనసభ ప్రకటించిన మూడు కమిటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలకు స్థానం దక్కింది. ఈ మేరకు సోమవారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నేతృత్వాన నియమించిన ఈ కమిటీల వివరాలను అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు విడుదల చేశారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ), ఎస్టిమేట్స్ కమిటీ(అంచనాల కమిటీ), పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీలను ప్రకటించగా ఇందులో పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సభ్యుడిగా నియమితులయ్యారు. అలాగే, అంచనాల కమిటీలో వైరా, ఇల్లెందు ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్‌నాయక్, కోరం కనకయ్యకు అవకాశం దక్కింది. ఒక్కో కమిటీలో 12 మంది సభ్యులు ఉండగా ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురికి స్థానం దక్కడం విశేషం. కాగా, అంచనాల కమిటీలో తనకు సభ్యుడిగా అవకాశం కల్పించడంపై వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. వైరా నియోజకవర్గం ఏర్పడ్డాక నాలుగో సారి జరిగిన ఎన్నికల్లో రాందాస్ 33వేల పైచిలుకు మెజార్టీతో గెలవగా, అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యుడిగా ఇక్కడి ఎమ్మెల్యేకు అవకాశం రావడం ఇదే తొలిసారి.

అయినా ఆగని ప్రయాణం



గ్యాస్ సిలిండర్‌తో బ్రిడ్జిపై గోడ దాటుతున్న వ్యక్తి



వినాయక విగ్రహాల నిమజ్జనానికి వస్తున్న భక్తులు

ఖమ్మంమయూరిసెంటర్: భారీ వర్షాలతో ఈనెల 1న మున్నేరుకు వచ్చిన వరదతో ఖమ్మం ప్రకాశ్‌నగర్ వద్ద బ్రిడ్జి ప్రమాదకర స్థితికి చేరింది. పిల్లర్ల బేరింగ్‌లపై ఉన్న స్పాన్లు కదలడంతో రాకపోకలను నిలిపేసిన అధికారులు రెండు వైపులా గోడ కట్టించడమే కాక కందకాలు తవ్వారు. అయినప్పటికీ చుట్టూ తిరిగి రావడం భారంగా మారడంతో ప్రజలు బ్రిడ్జిపై నడకదారిన రాకపోకలు సాగిస్తున్నారు. ఖమ్మం రూరల్ మండలం వైపు నుండి బ్రిడ్జి వరకు ఆటోలో వచ్చి అక్కడ నుండి నడక మార్గాన నగరంలోకి ప్రవేశిస్తున్నారు. అలాగే, నగరం నుండి ఆవలి వైపునకు కూడా ఇదే తరహాలో వెళ్తున్నారు. రెండు వైపులా నిర్మించిన గోడ ఎత్తు తక్కువగా ఉండడంతో ఎక్కి దిగి కందకాలు దాటుతున్నారు. ఇక ఇళ్లల్లో వినాయకుడిని ప్రతిష్ఠించిన భక్తులు సైతం ప్రతిమల నిమజ్జనానికి బ్రిడ్జి పైకి వస్తుండడంతో కిటకిటలాడుతోంది.

నా ఖమ్మం కోసం నేను..

- సర్టిఫికెట్ల జారీకి ముంపు ప్రాంతాల్లోనే దరఖాస్తుల స్వీకరణ
- ఖమ్మంలో మాత్రం నేటి నుంచి ప్రత్యేక శిబిరాలు
- మీ సేవ, ధరణి దరఖాస్తులు, ల్యామినేషన్ ఖర్చంతా ప్రభుత్వానిదే...
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంమయూరిసెంటర్: గతంలో ఎన్నడూ లేని విధంగా మున్నేరుకు వచ్చిన భారీ వరదతో వేలాది కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని, బాధితులను ఆదుకునేందుకు 'నా ఖమ్మం కోసం నేను' పేరిట కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మంలోని మున్సి పల్ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సోమవారం సమావేశమై మాట్లాడుతూ వరదతో సర్టిఫికెట్లు కోల్పోయిన వారికి తిరిగి జారీ చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. భారీ వర్షాలు, వరదలతో విద్యార్హతలు, ఉద్యోగాల సర్టిఫికెట్లు, విలువైన డాక్యుమెంట్లు పోగొట్టుకున్న వారికి తిరిగి అవన్నీ జారీ చేస్తామని తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మినహా ఖమ్మం రూరల్, సత్తుపల్లి, వైరా, మధిర పట్టణ ప్రాంతాల్లో నియమించిన 72 బృందాలు ముంపు ప్రాంతాల్లో యజమానుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమం పది రోజులు కొనసాగనుండగా, ఆతర్వాత కూడా ప్రత్యేక శిబిరాల్లో దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సర్టిఫికెట్లు జారీ చేయిస్తామని వెల్లడించారు. కాగా, ఒక దరఖాస్తుదారుడికి సంబంధించి అన్ని సర్టిఫికెట్లు జారీ అయ్యాక లామినేషన్ చేయించి ప్రత్యేక ఫోల్డర్‌లో ఇంటి వద్దే అందిస్తామని, ఈ క్రమంలో మీ సేవ, ధరణి, ఇతరత్రా రుసుములు, లామినేషన్ ఖర్చంతా ప్రభుత్వమే చెల్లిస్తుందని కలెక్టర్ తెలిపారు.

విదేశాలకు వెళ్తున్న వారి కోసం..

విదేశాల్లోని విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ఉద్యోగాల కోసం అత్యవసరంగా సర్టిఫికెట్లు అవసరమైన వారు తమ హాట్‌లైన్ నంబర్‌ను టోల్ ఫ్రీ నంబర్ 1077 లేదా 90632 11298 వాట్సప్ నంబర్‌కు రుజువులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. దీంతో వారికి వారం లోగా ప్రొవిజనల్ సర్టిఫికెట్లు జారీ చేస్తామని తెలిపారు. కాగా, సర్టిఫికెట్ల జారీ కేవలం భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన వారికి మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీఈఓ సోమశేఖరశర్మ, డీఐఈఓ రవిబాబు, ఎల్‌డీఎం శ్రీనివాసరెడ్డి, ఈడీఎం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం నగరంలో శిబిరాలు..

మున్నేరు వరదలతో సర్టిఫికెట్లు కోల్పోయిన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డివిజన్ల వారీగా శిబిరాలు ఏర్పాటుచేస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఖమ్మం 46, 47, 48 డివిజన్లకు సంబంధించి నయాబజార్ ప్రభుత్వ పాఠశాలలో, 11వ డివిజన్ వాసులకు ఐటీ హబ్, 16వ డివిజన్‌కు ధంసలాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, 17వ డివిజన్‌కు సంబంధించి గీతాంజలి పాఠశాల, 49వ డివిజన్‌కి సంబంధించి డీఆర్డీఓ కార్యాలయం, 28, 29, 30 డివిజన్లకు సంబంధించి రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, 59, 60 డివిజన్లకు సంబంధించి రామన్నపేట రైతు వేదిక, 34, 35 డివిజన్లకు సంబంధించి ప్రభుత్వ మహిళా కళాశాల, గాంధీ చౌక్‌లో శిబి రాలు ఏర్పాటుచేశారు. ఆయా శిబిరాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వెల్లడించారు.

మరో మూడు రోజులు వర్షసూచన

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించినందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం ఆయన ఆర్డీఓలు, తహసీల్దార్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తహసీల్దార్లు, పోలీస్, పంచాయతీ, ఇరిగేషన్ అధికారులంతా సమన్వయంతో వ్యవహరించాలని తెలిపారు. ప్రమాదకరంగా మారిన కల్వర్టులు, కాజ్‌వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని, రహదారులపైకి వరద చేరితే రాకపోకలు నిలిపివేయాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు కార్యస్థానంలో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చేలా పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

వైరా రిజర్వాయర్‌లో తెప్పపై కలెక్టర్!

మత్స్యకారుల సమస్యలపై ఆరా



తెప్పపై వెళ్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

వైరా: కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెప్పపై 20 నిమిషాల పాటు వైరా రిజర్వాయర్‌లో కలియదిరిగారు. వైరాలో సోమవారం పర్యటించిన కలెక్టర్ ముంపునకు గురైన రాజీవ్‌నగర్ కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆపై 'రిజర్వాయర్‌లోకి వెళ్లాలి.. నీకు తెప్ప నడిపే అలవాటు ఉందా' అని అక్కడే ఉన్న మున్సిపాలిటీ కాంట్రాక్ట్ కార్మికుడు జాన్‌ను అడిగి ఆయనతో కలిసి రిజర్వాయర్‌లోకి వెళ్లారు. రిజర్వాయర్‌లోకి వరద ఎక్కడి నుంచి వస్తుంది, నిండాక బయటకు వెళ్లే మార్గాలు, ఎందరు మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు, అధికారులు లైఫ్ జాకెట్లు ఇచ్చారా అంటూ పలు వివరాలు ఆరా తీశారు. ఇటీవల వరద, ఈదురుగాలులకు మత్స్యకారుల వలలు పడిపోయాయని చెప్పగా నష్ట పరిహారం అందేలా చూస్తానని కలెక్టర్ తెలిపారు. అలాగే, రిజర్వాయర్‌లో చేపలు పడుతున్న పరమేశ్వర్ అనే మత్స్యకారుడితో మాట్లాడి పిల్లలు, కుటుంబం వివరాలు తెలుసుకుని బాగా చదివించాలని సూచించారు. ఆతర్వాత జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నవీనజ్యోతి వినతితో కళాశాలకు వెళ్లి పరిశీలించారు. భవనం శిథిలావస్థకు చేరిందని, టాయిలెట్లు సరిపడా లేవని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. అలాగే, అసంపూర్తిగా గదులపై డీఐఈఓ రవిబాబుకు ఫోన్ చేసి తెలుసుకున్నారు. కళాశాలలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటకు మార్చాలని, నిల్వ నీటిని తొలగించాలని మున్సిపల్ కమిషనర్ వేణును ఆదేశించారు. తహసీల్దార్ కేవీ.శ్రీనివాస్, ఆర్ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

లభ్యం కాని వీరయ్య ఆచూకీ

గాలింపును పరిశీలించిన అదనపు కలెక్టర్



గాలింపు చర్యలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

చింతకాని: మండలంలోని మత్కేపల్లి గ్రామ తుమ్మల మ్మ చెరువులో గల్లంతైన పిల్లి వీరయ్య ఆచూకీ కోసం సోమవారం కూడా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గాలించినా జాడ తెలియరాలేదు. సూర్యాపేట జిల్లా హుజూరునగర్ మండలం నం దగిరికి చెందిన వీరయ్య తుమ్మల మ్మ చెరువులో చేపల పట్టేందుకు వెళ్లి ఆదివారం గల్లంతైన విషయం తెలిసిందే. చింతకాని మండలం జగ న్నాథపురంలో కుమార్తె వద్ద ఉంటున్న ఆయన మరో ఇద్దరితో కలిసి చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తు గల్లంత య్యాడు. ఈమేరకు రెండో రోజైన సోమవారం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గాలించినా ఆచూకీ లభిం చలేదు. అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీఓ గణేష్, వైరాసీఐ సాగర్ తదితరులు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

ఐటీఐల్లో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీ ఐల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు కన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హతలు కలిగిన వారు ఈనెల 11నుంచి 20వ తేదీ వరకు http://iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మూడు దఫాల్లో సీట్లు రాని అభ్య ర్థులు సైతం దరఖాస్తు చేసుకుని, నిర్ణీత తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

విద్యార్థుల మదిలో చెరగని స్థానం



ప్రభాకర్‌రెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం: ఉత్తమ ఉపాధ్యాయులు విద్యార్థుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశం తెలిపారు. ఇటీవల జాతీయ ఉత్తమ ఉపాధ్యా యుడిగా ఎంపికై అవార్డు స్వీకరించిన తిరుమ లాయపాలెం జెడ్పీహెచ్ఎస్ బయాలజీ ఉపా ధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో ఆయనను కలిశారు. ఈ సంద ర్భంగా ప్రభాకర్‌రెడ్డి రూపొందించిన వినూత్న బోధనా పద్ధతులు, ఇతర అంశాలపై ఆరా తీసి అభినందించారు.

11నుంచి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 11 నుంచి 17 వరకు జిల్లాలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా ఈనెల 11న ఖమ్మం పాత బస్టాండ్ వద్ద ఉన్న గిరిప్రసాద్ విగ్రహం, చిమ్మపుడి, పాపటపల్లి గ్రామాల్లో రజబ్‌అలీ విగ్రహాల వద్ద నివాళులరి ్పంచనున్నట్లు వెల్లడించారు. అలాగే, మిగతా రోజుల్లో తెలంగాణ సాయుధ పోరాటంలో భాగస్వాములైన వారికి నివాళులర్పించి, 17న ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల సభ నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాల్లో పార్టీ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని విజయ వంతం చేయాలని ఆయన కోరారు.

నేడు బీజేపీ సభ్యత్వ నమోదు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఖమ్మం లో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలోని శ్రీశ్రీ హోటల్‌లో ఉదయం పదిన్నర గంటలకు మొదలయే కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొంటారని వెల్లడించారు. ఆతర్వాత వరద ముంచెత్తిన ప్రాంతాల్లో బాధితులకు నిత్యావ సర సామగ్రి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

వరద బాధితులకు రూ.10 లక్షల విరాళం

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరదతో దెబ్బతిన్న బాధితులకు తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.10 లక్షల సా యం ప్రకటించారు. ఖమ్మంలో మున్నేరు వర దల కారణంగా దెబ్బతిన్న వారిని ఆదుకోవా లన్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపుతో భద్రాద్రి జిల్లా ఇరవెండి గ్రామానికి చెందిన తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.10 లక్షలు అందజేయన్నట్లు తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ తెలిపారు. ఈ నిధులతో వరద ప్రాంతాల్లో విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సహాయక కార్యక్రమాలు చేపడుతామని వెల్లడించారు.

ముసురుతున్న వ్యాధులు

- వర్షాలు, వరదతో పెరుగుతున్న బాధితులు
- జ్వరం, జలుబు, దగ్గుకు తోడు చర్మవ్యాధులతో ఇక్కట్లు
- వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ప్రత్యేక వైద్యశిబిరాలు
- ఇంటింటి సర్వేతో పరీక్షలు, పర్యవేక్షణ



బొక్కలగడ్డ ప్రాంతంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వైద్యశిబిరం

ఖమ్మంవైద్యవిభాగం: విడవకుండా కురుస్తున్న వర్షం.. మున్నేటి వరద ముంచెత్తిన కాలనీల్లో పేర కుపోయిన బురద, చెత్తాచెదారంతో వ్యాధులు ముసురుతున్నాయి. విషజ్వరాలకు తోడు వాంతు లు, విరేచనాలు, గొంతునొప్పి జలుబుతో పాటు చర్మవ్యాధులు కూడా వ్యాప్తి చెందుతున్నాయి. వరద ముంపు ప్రాంతాల్లో చర్మవ్యాధుల వ్యాప్తి ఎక్కువగా ఉందని తెలుస్తోంది. ఈ తరుణంలో 1వ తేదీ నుండి జిల్లా, వైద్య ఆరోగ్య శాఖ ఇంటింటి సర్వే చేపట్టింది. ఈ సర్వేలో జ్వరంతో బాధపడు తున్న వారిని గుర్తించగానే మందులు పంపిణీ చేస్తుండగడం.. ప్రత్యేక వైద్య శిబిరాల ద్వారా చికిత్స చేస్తున్నా వ్యాధుల వ్యాప్తి ఆగడం లేదు. ఇన్నాళ్లు ఇళ్లు శుభ్రం చేసుకోవటం, మరోపక్క పున రావాస కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయడంతో సరిపోగా.. ఇప్పుడు వ్యాధులతో ముంపు ప్రాం తాల ప్రజలపై కోలుకోలేని దెబ్బ పడుతోంది.

896 బృందాల ద్వారా సేవలు

జిల్లాలో 896 వైద్యబృందాలు పనిచేస్తుండగా.. ఖమ్మం మున్నేరు, ఇతర ముంపు పాంతాల్లో మొత్తం 60 బృందాలు ఇంటింటి సర్వేలో పాల్గొంటున్నాయి. మెడికల్ ఆఫీసర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్త, సూప ర్‌వైజర్‌తో కూడిన ఈ బృందాలు బాధితులు పరీక్ష లు చేసి మందులు అందజేస్తున్నారు. ఎవరికైనా ఇబ్బందిగా ఉంటే జనరల్ ఆస్పత్రికి తరలిస్తున్నారు. మరోపక్క ఖమ్మంలో 18, ఇతర ప్రాంతాల్లో ఎనిమిది ప్రత్యేక వైద్యశిబిరాలు, ఐదు మొబైల్ టీం ల ద్వారా నిరంతరాయంగా వైద్య సేవలందిస్తు న్నారు. ఇప్పటివరకు సర్వేలో 5,234 మందికి విష జ్వరాలు సోకినట్లు తేలగా మందులు ఇచ్చిన వైద్యా ధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

రెండు రోజులుగా మంచంలోనే..



ఈమె పేరు జి.ధనలక్ష్మి. భర్త ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండగా మున్నేరు వరదతో వీరు నివాసముండే బొక్కలగడ్డ పూర్తిగా నీటమునిగింది. పునరావాస కేంద్రం నుంచి వచ్చి రెండు రోజులుగా ఇంట్లోనే ఉంటుండగా ధనలక్ష్మికి తీవ్రమైన జ్వరం వచ్చింది. మందులు వాడుతున్నా తగ్గట్లేదు. భర్త ఆటో నడపడానికి వెళ్తే... జ్వరంతో కాళ్లు కదపలేని స్థితిలో పిల్లలను చూసుకోలేక తిప్పలు పడుతోంది.

1,98,830 ఇళ్లలో సర్వే పూర్తి

గడిచిన వారం రోజుల్లో జిల్లాలోని 1,98,830 ఇళ్లలో సర్వే చేసిన బృందాలు 7,05,578 మందికి వైద్యప రీక్షలు నిర్వహించాయి. వీరిలో 5,234 మందికి విష జ్వరాలు సోకగా, 234 డయేరియా(విరేచనాలు) కేసులను గుర్తించారు. ఇక వారం రోజులుగా బురద, వరదలో తిరుగుతుండడం.. ఇళ్లను శుభ్రం చేసే క్రమాన నీళ్లలో నానుతుండడంతో పలువురు చర్మ వాధులు బారిన పడినట్లు వైద్యాధికారులు చెబుతు న్నారు. ఇలాంటి కేసులు 150 ఉండగా మందులతో పాటు లోషన్లు సమకూరుస్తున్నారు. కాగా, 14 మం దికి పరిస్థితి తీవ్రంగా ఉండడంతో జనరల్ ఆస్పత్రికి తరలించారు. మొత్తంగా 44,723 మందికి మందు లు అందజేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

బిడ్డ జ్వరం తగ్గితే చాలు..



ఈ చిత్రంలోని ఐదేళ్ల చిన్నారి ఐ.బిందు మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. వైద్యుడు సూచించిన మందులు వాడుతున్నా తగ్గినట్లే తగ్గి మళ్లీ జ్వరం వస్తోంది. తండ్రి కూలి పని చేసుకుంటుండగా తల్లి గృహిణి. మున్నేటి తాకిడితో బొక్కలగడ్డలోని వారి ఇల్లు పూర్తిగా మునిగిపోయి సర్వం కోల్పోయారు. అయినా పర్వాలేదు.. తమ బిడ్డ జ్వరం తగ్గి సాధారణ స్థితికి చేరాలని కోరుకుంటున్నారు.



వారం రోజుల్లో క్యాంపులు, సర్వే బృందాల ద్వారా అందించిన సేవలు

ఏరియా	సందర్శించిన ఇళ్లు	ఫీవర్ కేసులు	మందులు తీసుకున్న వారు
ఖమ్మంలో సర్వే	14,882	718	7,324
ఇతర ప్రాంతాల్లో సర్వే	1,74,297	4,025	31,174
ఖమ్మంలో క్యాంపులు	9,153	343	5,232
ప్రత్యేక బృందాల సర్వే	489	148	993

ఐదు రోజులుగా జ్వరం తగ్గట్లేదు



తొమ్మిది నెలల మా బిడ్డకు ఐదు రోజులుగా జ్వరం తగ్గట్లేదు. వరదతో సర్వం కోల్పోయి, స్తోమత లేకపోయినా ప్రైవేట్ ఆస్పత్రిలో చూపిస్తున్నాం. రోజు ఆటోలో వెళ్లి రావాల్సి వస్తోంది. ఎన్ని మందులు వాడినా జ్వరం మాత్రం తగ్గట్లేదు. ఇప్పటికే మున్నేరు ముంపుతో సర్వం కోల్పోయాము. ఇక్కడ మా అద్దె ఇంటిని వరద ముంచెత్తింది. కనీసం మా బిడ్డకు తగ్గాలని కనిపించిన దేవుడినల్లా మొక్కుతున్నాం.

– వందుల వెన్నెల, పెద్దమ్మతల్లి గుడి, ఖమ్మం

ఇంటిల్లిపాది జ్వరంతోనే...



ఇంట్లో చేరిన బురద శుభ్రం చేసుకోవడానికి నాలుగు రోజులు పట్టింది. సామగ్రి కొట్టుకుపోవడంతో చాలా నష్టపోయాం. ఇంతలోనే తోడు ఇంటిల్లిపాదికి జ్వరాలు సోకాయి. నాలుగు రోజులుగా అందరం జ్వరంతో బాధపడుతున్నాం. అంతే కాకుండా చర్మవ్యాధులు సోకాయి. దద్దుర్లు, చీదర, కళ్ల మంటలతో అవస్థ అవుతోంది. వైద్య శిబిరంలో చికిత్స చేయించుకుంటే ప్రస్తుతం కొంత తగ్గినా నీరసం పోవట్లేదు. – పల్లె నాగరాజు, పెద్దమ్మతల్లిగుడి, ముంపు ప్రాంత బాధితుడు

వ్యాధుల కట్టడికి కార్యాచరణ



వరద ప్రభావిత ప్రాంతాల్లో వ్యాధుల వ్యాప్తి కట్టడికి కార్యాచరణతో వెళ్తున్నాం. 865 బృందాల ద్వారా ఇంటింటి సర్వే జరుగుతోంది. వరద ప్రభావిత ప్రాంతాల్లో 26 వైద్యశిబిరాలు, మున్నేరు పరివాహక ప్రాంతాల్లో ఐదు రీహాబిలిటేషన్ సెంటర్లు ఉన్నాయి. అనారోగ్య సమస్య తీవ్రంగా ఉంటే జనరల్ ఆస్పత్రికి తరలిస్తున్నాం. వేడి ఆహారం, కాచి చల్లార్చిన నీటిని తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– వి.సుబ్బారావు, డీఎంహెచ్ఓ

విద్యుత్ సమస్యకు పరిష్కారం

డిప్యూటీ సీఎం ఆదేశాలతో లైన్ మార్పు



సబ్ స్టేషన్ వద్ద ఎస్ఈ సురేందర్, ఉద్యోగులు, నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెంలో రైతులు ఎదుర్కుంటున్న విద్యుత్ ఓవర్ లోడ్ సమస్య పరిష్కారమైంది. మామునూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నుండి అయ్యవారిగూడెం రైతుల పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లకు ఇన్నాళ్లు సరఫరా జరు గుతోంది. అయితే, ఇటీవల అంతరాయం ఏర్పడు తుండడంతో రైతులు అధికారులకు విన్నవించినా ఫలితం లేక ఆదివారం మండల పర్యటనకు వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసు కెళ్లారు. దీంతో ఆయన సమస్యను పరిష్కరించాలని ఏడీఈ అనురాధ, ఏఈ శ్రీనివాసరావును ఆదేశిం చారు. ఈమేరకు ఎస్ఈ సురేందర్, డీఈ హీరాలాల్ సోమవారం చేరుకుని మామూనూరు సబ్‌స్టేషన్ నుండి అయ్యవారిగూడెంకు సరఫరా తొలగించి కొత్త లైన్ బిగించి భీమవరం సబ్‌స్టేషన్ నుండి సర ఫరా ఇచ్చారు. దీంతో ఇక నుంచి హెచ్చుతగ్గులు ఉండవని ఎస్ఈ సురేందర్ తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయ కులు శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు కృష్ణారావు, వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వేమిరెడ్డి సత్యనారాయ ణరెడ్డి, లక్కిరెడ్డి జగన్‌మోహనరెడ్డి, వేమిరెడ్డి అనం త్‌రెడ్డి, బెజ్జం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వరదల సమయాన రాజకీయాలు సరికాదు



సామగ్రి పంపిణీ చేస్తున్న హన్మంతరావు, తదితరులు

ఖమ్మం రూరల్: వరదల సమయాన రాజకీయాలు చేయడాన్ని ప్రతిపక్షాలు మానుకోవాలని మల్కాజ్ గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సూచించారు. మండలంలోని నాయుడుపేట, జల గంనగర్‌ల్లో వరద బాధితులకు సోమవారం ఆయన నిత్యావసర సరుకులు అందచేసి మాట్లాడారు. గత ప్రభుత్వం అడ్డగోలుగా నిర్మాణ అనుమతులు ఇవ్వ డంతోనే ఇప్పుడు వేలాది మంది ఇబ్బంది పడుతు న్నారని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో నిర్వాసితులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరవుతాయని ఆయన తెలిపారు. కార్య క్రమంలో మార్కెట్ చైర్మన్ హరినాథ్‌బాబు, నాయ కులు టి.దయాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, బండి జగదీష్, భద్రకాళి, వీరారెడ్డి, అశోక్‌నాయక్, సురేష్‌నాయక్, వెంకటేష్, సుబ్బారావు, మురళి, వేణు, నవీన్, సాయి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగెకరాల పంట, పెట్టుబడి వరద పాలు



రాళ్లు తేలిన భూమి వద్ద బాబురావు కుటుంబం

నేలకొండపల్లి: ఆరుగాలం కష్టపడి పండించిన పం ట వరద పాలైందని ఓ కౌలు రైతు కన్నీరుమున్నీర వుతున్నాడు. మండలంలోని మంగాపురంతండాకు చెందిన తేజావత్ బాబురావుకు సెంట్ భూమి కూడా లేకపోవడంతో కౌలుకు తీసుకుని సాగు చేస్తు న్నాడు. ఈ ఏడాది కూడా చెరువుమాధారం చెరువు కింద నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేశారు. ఇప్పటికే రెండు సార్లు మందులు పిచికారీ చేసిన ఆయన దాదాపు రూ.1.20 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. వరి ఏపుగా పెరిగి బిర్రు పొట్ట దశలో ఉండగా వరదతో నాలుగెకరాల పంట పూర్తిగా కొట్టుకుపోయింది. పొలం ఆనవాళ్లు లేకుం డా రాళ్లు, ఇసుక మేటలు తేలాయి. రైతు బాబురావుకు ముగ్గురు కుమార్తెలు ఉండగా.. సోమవారం కుటుంబంతో కలిసి పొలానికి వచ్చిన ఆయన పరిస్థితిని చూసి బోరున విలపించాడు. జరిగిన నష్టం ఎలా భర్తీ అవుతుంది, కౌలు డబ్బు ఎలా చెల్లించాలో తెలియడం లేదని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

ఎప్పుడు ఆరుతాయో..?!



నయాబజార్ కళాశాలలో ఆరబెట్టిన రికార్డులు, (ఇన్‌సెట్) సర్టిఫికెట్లు



మున్నేరు వరదతో ఖమ్మంలోని నయాబజార్ కళాశా లలోకి భారీగా వరద చేరింది. దీంతో కళాశాలలోని రికార్డులు, విద్యార్థుల సర్టిఫికెట్లు తడిసిపోయాయి. వర్షాలు తగ్గడంతో ఉద్యోగులు వీటిని ఆరబెడుతు న్నారు. కానీ ఇందులో ఎన్ని పనికొస్తాయో తెలియడం లేదు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

వరద బాధితులకు 'రోటరీ' ఆపన్నహస్తం



ధంసలాపురంలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: భారీ వర్షాలు, వరదతో చిన్నాభి న్నమైన కుటుంబాలకు రోటరీ క్లబ్ అండగా నిలిచింది. మున్నేరు, ఆకేరు పరీవాహక ప్రాంతం లోని ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలం తోపాటు పాలేరు నియోజకవర్గంలో వేలాదిగా ప్రజలు సర్వం కోల్పోయారు. ఈ నేపథ్యాన బాధి తులకు చేయూతనిచ్చేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం, సెంట్రల్ క్లబ్, ఇన్నర్‌వీల్ అసోసియేషన్ విభాగాలు నడుం బిగించాయి. ఇందులో భాగంగా ఐదు కిలోల బియ్యం, రెండు కిలోల రవ్వ, వంట నూనె, చక్కెర, ఉప్పు, పప్పు, ఉల్లిపాయలు, ఆలుగడ్డలు, సబ్బులతో కూడిన రూ.వెయ్యి విలువైన 2,500 కిట్లను సోమవారం ఖమ్మం రామ న్నపేట, ధంసలాపురం తదితర ప్రాంతాల్లో పం పిణీ చేశారు. రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3150లోని వివిధ శాఖల ఆర్థిక సాయంతోపాటు స్వచ్ఛంద సంస్థల చేయూతతో సమకూరుస్తున్న ఈ కిట్లను మరికొన్ని ప్రాంతాల్లో కూడా పంపిణీ చేస్తా మని ప్రతినిధులు తెలిపారు. రోటరీ జిల్లా గవర్నర్ కె.శరత్‌చౌదరి, డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మల్లాది వాసు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రవీంద్రనాథ్, జి.రాంబాబు, హరి శ్రీనివాస్, ఎస్ ప్రవీణ్‌తోపాటు దొడ్డపనేని సాంబశివరావు, పలివెల భూషణ్‌రావు, కె.కొండల్ రావు, పసుమర్తి రంగారావు, కాళ్ల పాపారావు, ఐ.రామకృష్ణ, కోటేరు వెంకటరెడ్డి, బొడ్డు సుధాకర్, స్వర్ణలత, శరీదేవి, విజేత, కమల, ప్రమీల, జానాబాయి, కవిత పాల్గొన్నారు.

కొనసాగుతున్న కాల్వ గండి పూడ్చివేత పనులు



గండి పడిన చోట మట్టి నింపుతున్న దృశ్యం

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వా యర్‌కు ఇటీవల వచ్చిన భారీ వరదతో సాగర్ ఔట్ ఫ్లో కాల్వకు పలు చోట్ల గండి పడిన సం గతి తెలిసిందే. ప్రస్తుతం వరద ప్రవాహం, వర్షం తగ్గుముఖం పట్టడంతో జలవనరుల శాఖ అధికారులు గండ్ల పూడ్చివేత పనులను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా సోమ వారం కంకర డస్ట్ నింపిన బస్తాలు వేసి మట్టి తో గండిని పూడ్చివేశారు. కాల్వ కట్టను కూడా గతంలో మాదిరిగా నిర్మించేందుకు చర్యలు చేపట్టగా, పది రోజుల్లో పనులు పూర్తి చేస్తా మని అధికారులు తెలిపారు.

వరదలతో దెబ్బతిన్న రోడ్లు, డ్రెయిన్లు

కేఎంసీ పరిధిలో రూ.89.49 కోట్ల మేర నష్టం

ఖమ్మంమయూరిసెంటర్: భారీ వర్షాలతో ఈ నెల 1న మున్నేటికి వచ్చిన వరద ఖమ్మం నగరాన్ని ముంచెత్తింది. ఫలితంగా పలు ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, వీధి దీపాలు, ఫిల్టర్‌బెడ్ దెబ్బతిన్నాయి. మొత్తంగా రూ.89,49,97,000 మేర నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర సాయం కోసం నివేదిక సమర్పించేలా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆదేశాలతో ఇంజనీరింగ్ అధికారులు నివే దిక సిద్ధం చేశారు. ఇందులో భాగంగా 39.81 కి.మీ. సీసీ రోడ్లు దెబ్బతినగా మరమ్మతులకు రూ.25,87,65,000 అవసరమని అంచనా వేశారు. అలాగే, 10.60 కి.మీ. బీటీ రోడ్డు మరమ్మతుకు రూ.2.95 కోట్లు, 82.70 కి.మీ. మెటల్‌రోడ్డుకు రూ.9.92 కోట్లతో పాటు మట్టి, ఇతర రోడ్లు 171.25 కి.మీ. మేర దెబ్బతిన్నందున మరమ్మతు లకు రూ.10.27 కోట్లు అవసరమని అందులో పేర్కొన్నారు.ఇక 41.40 కి.మీ. మేర డ్రెయిన్ మర మ్మతులకు రూ.22.77 కోట్లు, 119 కల్వర్టులకు రూ.95.20 కోట్లు, 3,466 వీధిదీపాలకు రూ.1.38 కోట్లు, 3.52 కి.మీ. మేర తాగునీటి పైప్‌లైన్‌కు రూ.11.58 లక్షలు అవసరమని నివేదికలో పొందు పర్చారు. ఇక దానవాయిగూడెం ఫిల్టర్‌బెడ్ పరిక రాలు, పరిసరాల మరమ్మతుకు రూ.7 కోట్లు, కొత్త ఇన్‌టేక్ వెల్‌కు రూ.4.50 కోట్లు, ఫిల్టర్‌బెడ్ వద్ద విద్యుత్ సరఫరా వ్యవస్థను చక్కదిద్దేందుకు రూ.25 లక్షలు అవసరమని అంచనా వేశారు.

రామాలయ రిటైర్డ్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వా మివారి ఆలయ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గా న్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా పొడిచేటి రామచంద్రాచార్యులు, అధ్యక్షుడిగా పొట్టాబత్తు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మల్లంపల్లి పాండు ఎన్నికయ్యారు. ఉపా ధ్యక్షుడిగా కీర్తి రమేష్, కార్యదర్శిగా జీవీఎస్. సీతా రామాచార్యులు, కోశాధికారిగా నాగేశ్వరరావు, కన్వీన ర్‌గా సుబ్బారావుతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్ను కోగా.. సంఘం తరఫున సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.20 వేలు విరాళంగా ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సమావే శంలో సీతారామచంద్రాచార్యులు, రామకృష్ణంరాజు, భుజంగరావు, సత్యనారాయణ, రామకృష్ణబాబు, నర సింహాచార్యులు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ఏన్కూరు: మండలంలోని గార్లొడ్డు సమీపాన రహదారి పక్కన ఆగిన ట్రాక్టర్ ట్రక్కును సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. మియాపూర్ డిపోకు చెందిన లహరి బస్సు తెల్లవారుజామున 4.30గంటల సమయాన హైదరాబాద్ వెళ్తుండ గా మార్గమధ్యలో గార్లొడ్డు వద్ద ట్రక్కును ఢీకొట్టి పక్కకు దూసుకెళ్లింది. ఈ సమ యాన బస్సులో 17 మంది ప్రయాణికులు ఉన్నప్పటికీ ఎవరికీ ప్రమాదం జరగ లేదు. కాగా, గంటకు పైగా బస్సు రహదారికి అడ్డంగా ఉండడంతో రాకపోకలు నిలిచిపోవడంతో పోలీసులు, స్థానికులు టిప్పర్ ద్వారా పక్కకు తొలగించారు.

అంత్యక్రియలకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం

కామేపల్లి: బంధువును కడసారి చూసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దం పతులు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మండలంలోని సాతానిగూడెంకు చెందిన బొరిగొర్ల సురేష్ ఆదివారం మృతి చెందాడు. ఆయన అంత్యక్రియ సోమవారం జరుగుతుండగా బంధువులైన ఖమ్మంకు చెందిన కట్టబోయిన వెం కటరత్నం – పద్మ దంపతులు బైక్‌పై పండితాపురం వెళ్తున్నారు. ఈక్రమంలో సాతానిగూడెంకు చెందిన యువకుడు ద్విచక్రవాహనంపై ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో వెంకటరత్నంకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయనను ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఐస్ ఫ్యాక్టరీ నిర్వహణపై కేసు నమోదు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 11వ డివిజన్ కవిరాజ్‌నగర్‌లోని ఖానాపురం అలుగు వాగు స్థలాన్నిఆక్రమించి ఐస్ ఫ్యాక్టరీని ఏర్పాటుచేయడమే కాక అమోనియం గ్యాస్ వినియోగిస్తున్నారనే ఫిర్యాదుతో కేసు నమోదైంది. స్థానికుల ఆందోళన తో కేఎంసీ ఉద్యోగులు ఆదివారం కూల్చివేసేందుకు వెళ్లగా అమ్మోనియం గ్యాస్ పైప్‌లైన్లు ఉండడంతో వెనక్కి వచ్చారు. ఈమేరకు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేలా ఫ్యాక్టరీ ఏర్పాటుచేసిన నిర్వాహకులపై కవిరాజ్‌నగర్‌కు చెం దిన పరుచూరి నరేంద్రకుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో సోమవారం ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

కామేపల్లి: కొత్తలింగాలలోని అంగన్‌వాడీ కేంద్రం–2లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి కందిపప్పు, నూనె ప్యాకెట్లు, బియ్యం, గ్యాస్ సిలిం డర్ ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం కేంద్రానికి వచ్చిన అంగన్‌వాడీ టీచర్ మంగమ్మ తాళం పగలకొట్టి ఉండడంతో పరిశీలించగా చోరీ జరిగినట్లు తేలిం ది. దీంతో ఆమె ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.